# సత్యమేవజయ

చలం

చాలామందికి క్రైస్తుని శిక్షించిన రోమన్ మేజిస్ట్రేటు కన్న ఘోరమైన పాతకంచేసినమనిషి కనపడడు ఇన్ని యుగాలలోనూ, ఒక్క జూడాస్ తప్ప. కాని ఆజూడాస్ ఈనాడూ ఏనాడూ ప్రతిహృదయంలోనూ ఉన్నాడు కొద్దోగొప్పో.

పరికాళంగారిని అడిగితే ఈనాటి పరిపాలకుల్లోనే ఎందరిపేర్లు చెపుతారోమరి! ఇంతఘోరమైన పాతకంచేసిన ఆ రోమన్ మేస్ట్రేటు మనోవృత్తిని పరిశీలిస్తే ప్రజలందరూ గోలపెడుతున్నారు. చంపవలసినంత ద్రోహం ఆ జీసస్ ఏమీచేసినట్టులేదు. కాని అందరికీ అంత అయిష్టమైనవాడు చస్తేనేమంచిది" అనే విసుకుతో ఆశిక్ష వేసినట్టుంది. చచ్చింతరవాత జిహోవాముందు ఆమేస్త్రేటుని నించోపెట్టినప్పుడు—'నాకొడుకుని ఎందుకుచంపావురా!' అని దేవుడడిగితే, 'నీకొడుకేమిటి? నేనుచంపడమేమిటి?' అంటాడు.

'జీసస్ ని'

'అవును. ఏదో వెర్రికేకలు వేసుకుంటూ తిరిగేవాడు కదూ—చచ్చినవాళ్ళని బతికిస్తానంటూ. ఏమిటేచేదర అని శిలవవేయించాను, అతనిమతస్తులందరూ గోలపెడితే, అతను నీకొడుకా? నాకెట్లా తెలుస్తుంది?' అనివుంటాడు.

'తాను నా కొడుకని ఎన్నోసార్లు చెప్పుకున్నాడు కాదా?'

'ఎందరు ఎన్నెన్ని చెప్పుకోటంలేదు? అవన్నీ నమ్మితోవుంటే దేశపాలనేకాదు, అసలు బతకటమే సాధ్యం కాదు.

ఒక్కొక్క రోమన్ యుద్ధంలో లక్షలమంది చస్తారు. నీకొడుకు లెవరో వాళ్ళలో. ఎక్కడ వెతికి తెలుసుకోగలం?' అంటాడు.

మరి అతన్ని శిక్షిస్తాడా దేవుడు?

ఆదేశంతోనూ మతంతోనూ సంబంధంలేని రోమను గనక ఆమేజస్ట్రేటు అంతమాత్రం నిష్పక్షపాతంగా అన

(2)

గలిగాడు. కాని ఆనాటి ఇస్రవెట్ ని ఎవరినడిగినా జీసస్ ని సిలవ వెయ్యడం చాలా అవసరమూ ఉత్తమమైన పని అని ఏసందేహంలేకండా చెప్పివుంటాడు.

'నాపిల్లలు జబ్బులు పడుతోవుంటే, నాకు బదిలీ ఇమ్మంటే ఇచ్చాడుకాదు డైరెక్టరు. నాలుగేళ్ళు యమయాతన పడ్డాను. అందువల్లనే అతనికి వున్న వొక్క కొడుకూ చచ్చిపోయినాడు' అని చాలా నమ్మకంతో అనేవాడునా సహోపాధ్యాయుడు ఒకమిత్రుడు.

నిజమే ఆమిత్రుడు అనేక అవస్తలు పడ్డాడు బదిలీ కాకపోవడం మూలాన. వాటికి ఆ అధికారి బాధ్యుడేనా? దక్షిణదేశంలో హరిజన సమస్య బీహారులో భూకంపమయిందని గాంధిగారు రూఢిగా అన్నారు. ఆమాట అన్నతరవాత ఇంకోమనిషి ఐతే ఇంకఆయన మాటలమీద విశ్వాసం చలించకండా వుంటుందా?

తరవాత యుగాల్లో జీసస్ అంత ఘనత కెక్కాడు గనక, అతనిచావు అంతఘోరమై, అతన్ని చంపించిన వాళ్ళు అంత నీచులైనారు. ఎన్ని వేలహత్యలూ శిక్షలూ అంతకన్న అన్యాయమైనవి జరిగాయో! జీసస్ కి పూర్తిగా తెలుసు. తానో విప్లవం తీసుకొస్తున్నాననీ నిప్పుతో చెరలాట లాడుతున్నాననీ. చాలాఅమాయకంగా, ఓసహాయం చెయ్యబోయి,తత్ఫలితంగాచచ్చినవాళ్ళున్నారుఅనేకమంది.

అట్లానే గాంధిగారు కొల్లాయికట్టుకోకపోతే, రామనామం ఉచ్చరించకపోతే, అహింస బోధించకపోతే, ప్రార్థనకి వెళ్ళబోతూ వుండకపోతే, నూటఇరవై ఏళ్ళు బతక తలుచుకున్నాననకపోతే, ఆయన హత్యని అనేక రూపాల ప్రకటన చేసుకోడం దేశానికి అంతలాభదాయకం కాకపోతే, ఆయన హత్య ఇంత ఘోరరూపాన్ని ధరించేదికాదు ప్రజలమనసుల్లో. ఆయన జీవితోన్నత్యం, చేసిన అపారమైనసేవా, దేశానికి ఆయన అవసరం—అవన్నీ ఒకఎత్తూ ఈ చిల్లర విషయాలన్నీ ఒకఎత్తూ.

# సమీక్ష

మనిషిచేసిన ఘనకార్యాలుకావు. ఆ కార్యాన్ని ఘనంగా వర్ణించే రచయిత శైలిమీద ఆధారపడుతుంది ఆయనకీర్తి. శాశ్వతంగా నిలిచేపుస్తకంవల్ల ఆ పుస్తకం లోని వ్యక్తులకి శాశ్వతత్వం వొస్తుంది. అందువల్లనే నిజమైన లోకోద్ధారులకన్న, ఊహాకల్పనా వ్యక్తులైన శ్రీరామ, శ్రీకృష్ణులు మొదలైనవారికి ఎక్కువవ్యాప్తి శాశ్వతత్వం, గాంధిగారికన్న Hamlet కి ఎక్కువవ్యాప్తి ప్రపంచం మొత్తంమీద.

గోడ్సేగారి మోటివ్ సిన్సియర్ కావొచ్చు. అందువల్ల ముందుయుగాలవాళ్ళు తనని మెచ్చుకుంటారని ఆయన విశ్వాసం. ఏదోతనమతాన్ని ఉద్ధరించానని అనుకోవచ్చు. కాని ముందుయుగాలవాళ్ళు ఆయన్ని మెచ్చుకోవాలంటే క్రమంగా ఈదేశంలో మతంమీద నమ్మకం వున్నవారు (Religious Fanatics) అమితం కావాలి. మూర్ఖంగా మతంకోసం తమమతం బోధించే విలువల్నే ధ్వంసం చేసుకోడానికి సంసిద్ధులయ్యే మనుషులుగా తయారుకావాలి. అన్నిటికన్నా ముఖ్యం ఆయన పద్ధతుల్ని ఆరాధించే శిష్యులు, ఆయన్ని సమర్థిస్తో, గొప్పత్యాగమూర్తి అని వర్ణిస్తో, గొప్పకవి కలంనుంచి గొప్పకావ్యం బైలుదేరాలి. బొబ్బిలివారు ఎంత శౌర్యధనులో అసలు, ఫిరంగుల మీదికి కత్తుల్ని పట్టుకు దూకడం, శౌర్యమో, మూర్ఖమో, ఏమైతేనేం.

బచ్చులకడ ఇచ్చకములాడుట కాదిది విచ్చుకత్తిరా....

అంటే మనరక్తం ఎదురుపలకక మానదు. అదిబొబ్బిలి వారి శౌర్యప్రతిభకన్న కవికళాచాతుర్యం.

మనుష్యులమనస్సులమీద ఆధారపడనిఅసలుసత్యమనేది వుంటే, మనిషి తాను నిశ్చయంగా సత్యమని విశ్వసించే సత్యానికీ, ఆ అసలుసత్యానికీ సంబంధం ఏమీలేదు.

గాంధిగారు జీవితమంతా సత్యాన్వేషణలో గడిపాడు. కాని ఆయన కనుక్కున్న, అనుష్ఠించినసత్యాలలో అనేకం, చాలామంది బుద్ధిమంతులకి, ప్రశ్నార్థాలు—చాలామందికి అబద్ధాలు, మరి ఆయనలో సత్యం అనేకమందిని మార్పు గలిగిందంటే, అది సత్యప్రభావంకాదు. ఆయన పట్టుదలా, తక్కినప్రతిభా, అయనచూపేమార్గం ఆనాటికి ప్రజలకి అవసరమూ ఉపయోగమయింది కావడం—ఇవి కారణాలు కావొచ్చు.

ఆనిబిసెంటు 'గాంధిగారిని రాచకీయాలలో చంటిపిల్లాడింది. ఆయన ఏ నవీననాగరికతాపరికరాల్ని తిట్టాడో, ఆ టెలిగ్రాం, అచ్చుయంత్రం, వార్తా పత్రికలూ లేకపోతే, ఆయన సత్యం ఆయనలోనే అణగారి పోయేది.'

గాంధిగారు నూటఇరవై ఏళ్లూ బతికి, రాచకీయాలు ఇప్పుడు నడుస్తున్నట్టే అన్నేళ్లూనడిస్తే, గాంధిగారి చితాభస్మం ఎంతగౌరవం పొందేదో చాలా సందేహం.

ఆ సిలవపడక పోతే జీసస్‌వల్ల క్రిస్టియన్ మతానికి వొచ్చిన emotrinal strength ఏమాత్రం వుండేదికాదు. దాని వ్యాప్తికి అంతబలం చిక్కేదికాదు. ఈ ఇండియన్ క్రిస్టియన్ ఆడపిల్లలకి, వేళ్ళాడే జీసస్‌తలనిచూసి. వెక్కి వెక్కి ఏడవడానికి వీలేచిక్కేదికాదు.

గాంధిగారిని హత్యచెయ్యడంతో తనమతాన్నే హత్య చేశాడు గోడ్సే. ఏ దేశస్తులకి ఉపకారం చెయ్యాలనుకున్నాడో వాళ్ళకే ప్రపంచం ముందు తీరని తలవొంపులు కలిగించాడు. గాంధిగారు మామూలుగా చచ్చిపోతే నూజవీడు సినిమాహాలుముందు గాంధిగారి విగ్రహం ఎప్పుడూ ప్రతిష్టాపన జరిగేదికాదు. ఆ ముందు రోజువరకు 'ఆగాంధిగారెవరు?' అని తేల్చి చప్పరించే ధనికులు, ఆ మర్నాడంతా చీరెలుతడిసేట్టు ఒకటే ఏడ్చేవారుకారు.

ఏదోసత్యం, ధర్మం, శాశ్వతం; ఇట్లాంటిమాటలు మాట్లాడతారు, లోకంలో అవి ఎక్కడోవున్నట్టు సత్యమేవజయం-కాని ఎంతచూసినా వాటికి ఆధారం ఎక్కడా కనపడదు. సత్యంకోసం అన్వేషణ కనపడుతుంది మనుష్యస్వభావంలో. కాని ఒకరిలోని సత్యం అది ఎప్పటికీ అందరికీ బైటపడుతుందనీగాని, ఏనాటికో మనుషుల అంగీకారాన్ని పొందుతుందని గాని విశ్వసించడానికి ఆధారాలు చిక్కవు. చాలాకాలంమీద, మొత్తం మనుషుల్లో Abstract సత్యం విజయం పొందవొచ్చు. కాని నీ మిత్రుడు నిన్నినాడు తప్పుఅర్థం చేసుకుంటే— ఎంత వాదించీ అతన్ని నమ్మించలేవు. కాలానికి వొదిలితే నిన్నూ, నిన్ను అర్థంచేసుకోడాన్నీ అతను మరచి పోవడమూ, ఇద్దరిలో ఎవరోవొకరు చచ్చిపోవడమూ జరుగుతుంది. ఎంతమంది నిర్దోషులు కోర్టుల్లో శిక్షలుపడ్డారో! వాళ్ళునిర్దోషులని ఇంతవరకు ఎవరికీతెలీదు. తెలుసుకునేశక్తి ఏదోపైనవుందని అనుకుని కన్నీళ్ళుతుడుచుకోవాలి అంతే.

# సమీక్ష

చిన్నతనంనుంచి ఓమనిషి ఓఅభిప్రాయంలో పెరిగితే, ఆ అభిప్రాయం అతనికి సుఖాన్నీ తృప్తినీ ఇస్తోవుంటే, ఎంతవాదించీ, బోధించీ, అతన్ని దానికి విరుద్ధమైన అభిప్రాయంలోకి మార్చలేము. అందువల్లనే దేవుడు వుండటానికి వీల్లేదని, ఎంతగొప్పతర్కంవల్ల రుజువుచేసినా, కదలరు మనుషులు; దేవుడు లేడనుకోడంవల్ల వాళ్ళకి లాభంకనపడ్డదాకా. దేవుడుఉన్నాడనేవాళ్ళకి ఆనమ్మకంలాభం. లేడనేవాళ్ళకిఆనమ్మకంలాభం. కానితమస్వంతాన్ని తొలిగించుకుని, Objectiveగా నిజవిషయాల్నితూచి నిలవకట్టి, ఏదినిజమో తేల్చుకుని, దాన్ని ప్రచురించి, అనుష్టించి దానివల్లకలిగే కష్టనష్టాల్ని భరించగలధీరులు చాలా అరుదుగా ఉంటోనే వుంటారు. కానివాళ్ళుకూడా ఒకరినించిఒకరు భేదిస్తారు, కాలంలో తమనించి తామే అభిప్రాయాలు మార్చుకుంటారు. అందుకనివాళ్ళు మూసేది నిజమనటానికి వీల్లేదు.

ఇన్నిమతాలున్నాయి. ప్రతిమతంలోనూ, చాలామంది మేధావంతులూ, సత్యాన్వేషకులూ, ఎప్పుడూ ఉంటూనే వున్నారు. అట్లాంటివాళ్ళుకూడా వారికివిరోధమైనమతాన్ని అంగీకరించరు. అన్నిమతాలసారాంశమూ ఒకటే, అన్నీ ఒకచోటకే తీసుకునిపొయ్యేమార్గాలు అన్నవాడు వృత్తి మోసగాడు. అట్లాఐతే మతమే అవసరంలేదు. మతంలేని మార్గంకూడా అక్కడికే తీసుకుపోవాలి. అసలు ఎక్కడికీ తీసుకుపోవు, తీసుకుపోయేందుకు ఏమీలేదనే మతాన్ని కూడా అంగీకరించాలి. విశ్వాసాల్లోగాని, ఆచరణలోగాని రెండు పరస్పరమైనవిషయాలు రెండూ సత్యమేనంటే, అట్లా నిజంగా అర్థంచేసుకునేమనిషి, సత్యం మనసులమీద ఆధారపడిందిగాని, అసలు సత్యమనేది లేనేలేదనో, అది తెలీడం ఎన్నటికీ సాధ్యంకానిదనో అంగీకరించక తప్పదు. తమమనసుకి అంతస్పష్టంగా ఒకవిషయం కనపడుతోంది గనక అది అందరికీ నిజమైఉండాలనీ, అది నిజంకాదన్నవాడు మూర్ఖుడో, చోరుడో ఐవుండాలనే విశ్వాసం ప్రతి మనస్సులోనూ అంతర్భాగంగా ఉండబట్టే ప్రపంచంలో ఇన్నితగాదాలు.

ఎవరి పర్సనాలిటీలోనో, వాక్కులోనో, ధనంలోనో, కలంలోనో, ఎక్కువబలం, కళ, శ్రావ్యం, వుంటుందో ఎవరుచెప్పేది ప్రజలకి ఉపయోగకరంగా తోస్తుందో, అది ఆనాటికి సత్యమౌతుంది.

ఇది చాలా 'సినికల్'గా వినపడుతుంది. లేని ఆశల్ని రంగుల్ని కల్పించుకుని కలలుకనే మనస్సులకి, చాలా ఘోరం ఈ మాటలు — సత్యం, అసత్యాన్ని చెప్పేవిధం మీద ఆధారపడి వుందంటే.

మరి ఇంక మనిషిలో నిజంలేదా? వుంది. ఎవరిమనసుకి వారికి వుంది. కాని మనసుల్నిమించి విడిగా ఓసత్యం కనపడదు. ఎవరి సత్యం వారిదే. మన మనసులోని సత్యం ఇతర్ల మనసులోని సత్యంతో ఏకీభవిస్తే, దాన్ని వాళ్ళు సత్యమంటారు. భేదిస్తే అబద్ధమంటారు. మన చాతుర్యం వల్లనో, వాదనవల్లనో, వాళ్ళని వొప్పించ గలిగితే, మనం చాలా గొప్ప సత్యాన్వేషణకుల మౌతాము. వాళ్ళు ఎప్పుడు వొప్పుకుంటారంటే, వాళ్ళకి మనం చెప్పేది ఉపయోగమైన రోజున. అందుమూలానే ఎన్ని మనసులు వుంటే అన్ని సత్యాలూ వుంటాయి. కాని ఓసత్యాన్ని అందరూ వొప్పుకున్ననాడు కూడా ఆసత్యమే ఒక్కొక్క మనస్సులో ఒక్కొక్క విరుద్ధరూపంలో వుంటుంది. గాంధిగారి అహింసాసిద్ధాన్తం, ఆయన అనుగుఅనుచర్ల మనసులో ఏరూపంలో పనిచేస్తోందో తెలుస్తోనే వుంది. గాంధిగారు అంతఉపయోగకరమైన మనిషి కాకపోయినట్లైతే, ఆయన రాజకీయాల్లోకి ప్రవేశించక, హరిజన సమస్య, అహింస, ప్రేమ, సత్యాన్వేషణ రామనామం ఇట్లాంటివే మాట్లాడితే, చాలా ఉపేక్ష చెయ్యవలసిన crank కింద జమకట్టేవారే ఆయన్ని — ఆయనకి గొప్పగానమో, వక్తృత్వమో ఉంటేతప్ప. ఒక్కొక్క కేసులో సాక్షులుకూడా తప్పు అభిప్రాయపడి దోషి అని సాక్ష్యం చెపుతారు, జడ్జీ నమ్ముతాడు. శిక్షపడుతుంది. ప్రాణాలో పరువో పోతుంది. కానిదానికి పరిహారం ఎక్కడా జరగదు. కర్మ అని సమర్థించుకుంటే చాలదు. ఎవరుగట్టిగా చెప్పగలిగితే, వారు చెప్పేదానికి పరిస్థితులూ పరిసరాలూ, అనుకూలంగావుంటే, అదేసత్యం — అదిపూర్తి అబద్ధమైనాసరే.

ఓనాటిరాత్రి రైల్లో మిత్రుడు ప్రశ్నించగా చెపుతున్నాను నేనప్పుడు కొత్తగా రాస్తున్న 'బిడ్డలశిక్షణ' సంగతి—చెపుతూ తలితండ్రులూ, టీచర్లూ, పిల్లల్నికొట్టడం వల్ల ఎన్నివికృతాలు బిడ్డల్లో కలుగుతున్నాయో జోరుగా

వర్ణిస్తున్నాను. ఆ పక్కన కూచున్న నేనెరగని మనిషికి చాలా కోపం తెప్పించాయి నామాటలు —

"దెబ్బలులేక చెడిపోయిన పిల్లలు అంతకన్నలక్షలు" అన్నాడు బిగ్గరిగా. అందరూ మావంక చూశారు. ఏదో వాదించాననుకోండి. ఏమైతేనేం ఆరాత్రి అతనిదీ సంపూర్ణమైన విజయం. ఆనాటికేమిటి, ఈనాటికీ అతనిదే. అంతేకాదు ఏనాటికీ ఆయనదే కావొచ్చు బహుశా.

లోకంలో చూస్తున్నాను ముష్టిబలం అన్నిట్లోకీ గొప్ప వరం మానవుడికి. దాని తరవాత చెవుల్ని గింగిరుమనిపించే కంఠం, ఎక్కడా తడుముకోని వాక్ప్రవాహం. ఏం మాట్లాడుతున్నావు? ఎందుకు మాట్లాడుతున్నావనే ప్రశ్న లేదు. నీదీవిజయం. నిన్ను జయించగల్గింది దవడమీద గట్టి గుద్దు. దాన్నిమించిన ఆర్గ్యుమెంటు ఎవరూ కనిపెట్టలేదు ఇంతవరకు.

కనక సత్యం జయిస్తుందనడానికి ఏ ఆధారమూ లేదు. ఏ దృష్టితో సత్యాన్ని చూస్తున్నాడు? ఏకోణంనించి? ఆ ప్రత్యేకమైన మనసులో సత్యం ఏ రూపాన్నిధరించింది? అనేది స్పష్టంగా తేలింది. మనకి ఏమీ తెలీదన్నమాట. ఏమీ తెలియనిచోట, ఏదో తెలిసినట్టు అంతా తెలిసినట్టు తనకి తెలిసింది తప్ప ఇంకోటి లేనట్టు, మాయకప్పు కుంటో వుంటుంది మనిషిమనసు. ఒకగొప్పపురుషుడు చూసేదృష్టికీ మామూలు మనుష్యుడి దృష్టికీ వ్యత్యాసముందని కూడా అర్థంచేసుకోలేరు మామూలు మనుషులు. గాంధిగారు ప్రయత్నించింది గొప్పసహసం. ఈద్వేషజ్వాలల్ని ఆర్పడానికి, ప్రేమా సహనంమాత్రమే ఉపకరణాలనీ, ద్వేషాన్ని దేషంతో, హింసని హింసతో ఎన్నటికీ అంతం చెయ్యలేమనీ, తక్కిన ధర్మాలన్నీ యీ ధర్మం ముందు అవసరమైతే తప్పుకోవలిసిందేననే గొప్ప సత్యాన్ని అనుష్ఠించాలని చూచారు గాంధిగారు. ఈసత్యం అందరూ అంగీకరించిందే, అంగీకరించామన్నదే, కాని అనుష్ఠించాలనేప్పటికి వొస్తుంది చిక్కు. ఒక్కరైనాసరే అనుష్ఠించపూనుకునేప్పటికే కలుగుతుంది విప్లవం. గాంధిగారు తన అభిప్రాయాన్ని తను అనుష్ఠించడమేగాక, తనుచేసిన సేవవల్లకలిగిన **influence** మూలంగా, తన అభిప్రాయాన్ని, కొంత బలవంతంగానైనా, ఇతరులచేత అనుష్ఠింపచెయ్యాలని చూశారు. దానిఫలిం దారుణరూపాన్ని తాల్చింది. లక్షలమంది ప్రజల రక్తపాతాన్ని, అన్యాయాన్ని, ఆ అనుష్టానంలో కాఠిన్యతని గమనించిన ఏమనిషి రక్తమన్నా భగ్గుమనక మానదు. కాని అంతదారుణం తన కళ్ళముందు జరుగుతున్నా, దాన్ని శాంతంగా, స్థిరంగా తీసుకుని సహించగల గొప్పగంభీరతను సాధించగలిగారు ఆయన. మతాన్ని మించిన అధిగమించిన సత్యాచరణలో మత ప్రాముఖ్యాన్ని ఎదిరించి నిరోధించ వలసిన అవసరం ఎట్లానూ వొచ్చింది. ధర్మాలకన్న మతాలు గొప్పవి కావడం, ధర్మాలకీ, మతాలకీ ముడిపడడంవల్ల కలిగిన ఆపద. తన దేశస్థులకి ఉపకారం జరగాలని ఎన్ని విషయాల్లోనో చిన్నవాటిల్లో ఎన్నో కాంప్రమైజులు తనకి తెలిసో తెలీకండానో చేసుకున్నారు ఆయన. కాని తాను అన్నిటికన్నా అధికమని నమ్మినసూత్రాన్నిమాత్రం కల్తీ చేసుకోడానికి ఇష్టపడకపోవడంవల్ల జరిగినసంఘర్షణ హత్య.

గాంధిగారు తన జీవితమంతా దేశసేవకి అర్పించడం, దేశస్తులందరూ ముప్పైఏళ్ళు ఆయన్ని అవతారమని ఆరాధించడం, ఆయన యత్నంవల్లనే దేశానికి చాల వరకు స్వతంత్రం రావడం, ఇన్ని బలాలు ఆయనకి పట్టడంవల్ల ఆయన అహింసాసిద్ధాన్తం అంతమాత్రం అంత కాలం నిలవగలిగిందిగాని, కాకపోతే గోడ్సే సులభంగా **agitate** చేసి గాంధిగారిని జయించి ఉండగలుగును. ఏమన్నా విజయంపొందిందెవరంటే గాంధిగారు. గాంధిగారి అహింసాసిద్ధాంతం కాదు.

గొప్పసత్యాలన్నీ అంతే. అందరూ థియరీలో వాటిని వొప్పుకుంటారు, కాని ఆచరణలోకివొస్తే ఆ ఆచరణవల్ల తమకు ఏమాత్రం ఇబ్బందికలిగేట్టున్నా ఎదురుతిరుగుతారు, తప్పుకుంటారు.

గాంధిగారిదాకా అక్కర్లేదు, చలాన్ని 'గురుదేవా మీఅంతగొప్పవారులేరు. మీరు బోధించే ప్రతిఅక్షరం సత్యం' అన్నారు. ఆయన బోధనవల్ల ఇబ్బందికలగగానే, 'మాష్టరుగారిమాటలేనా అవి' అని హేళనగా చప్పరించి సిల్కుచీరెలు దులుపుకు లేచిపోతారు. మనసంస్కారం మన జ్ఞానం, ఒకేసంగతి అర్థం చేసుకునే మనఅర్హత ఏమిటి అని ప్రశ్నరాదు. ధనమూ కార్యాలతప్ప. వీరేశలింగంగారికి కుడిభుజంగా వున్న నేపతి సుబ్బారావుగారు

వితంతువు తన మరదలయ్యేప్పటికి ఆయనకి ప్రబల విరోధులైనారు.

ఆంధ్రులకి ప్రత్యేకరాష్ట్రం రాకపోవడంవల్ల కలుగుతున్న ఇబ్బందులు, ఆగిపోయిన ఆశలు, పక్షపాతం జరుగుతోందనే క్రోధాలు అనేకం. ఈవిషయమై రాష్ట్రసమస్యకన్న విశాలమైన దృష్టి వుంటుందని గాని, ప్రత్యేకంగా తెలుగువాళ్ళమీది నిర్లక్ష్యమే ఈ ఉపేక్షకి కారణం కాకపోవొచ్చుననిగాని, ఎవరినీ నమ్మించలేము. ఆంధ్రరాష్ట్రంపై గాంధిగారి సిన్సెరిటీని శంకించి తెలుగు పత్రికలు వ్రాసిన వాక్యాల అచ్చు తడి ఇంకా ఆరలేదు.

ప్రత్యేకంగా మనకి కావాలనుకోడం తప్పదు. ఆంధ్రరాష్ట్రపు ప్రత్యేకపు అవసరాన్ని గుర్తించని నాయకులు హిందూదేశ అవసరాల్ని ప్రపంచావసరాలనించి వేరుచేసి యోచించక తప్పదు.

ఈ 'నా'ఎట్లాగూ తప్పదు; దేంటోనో ఓదాంటో ఐక్యమై దాన్ని ప్రత్యేకంగా తనది చేసుకోవాలని, దాని శ్రేయస్సు తనది అనుకోడం, మనిషికి అవసరమైన సొంత వొస్తువులనించి, కుటుంబం, వూరు, దేశం, పెట్లా, గాంధిగారికీ, చివరికీ భగవాన్‌కికూడా ఏకొంచెమో, ఏకళ్ళజోడో—'ఏమయింది?' అనుకోడం తప్పదేమో! ఆ దేహాన్ని ఉంచుకోడానికి ప్రపంచంలో కొంచెం స్థలం మనదవుతుంది ఆ నిమషానికి. కాని లోపల్నించి దేహమూ తానూ అసలు లేరని స్పష్టంగా తెలుసుకున్న భగవాన్‌కి ఒక్కరికే లేదేమో స్వంతం. అసలు తామేలేనివారికి ఇంక స్వంతం ఏముంది?

పాపం, ఈ వెర్రిమనిషి మనసు తానుచుట్టూ చూసే ఈగొడవలోంచి,ఓసత్యాన్ని, ఓPlan న్ని, ఓన్యాయాన్ని ఆశని, వుందని కల్పించుకుని, ఆధారంచేసుకునిగాని బతకలేదు. కొన్ని కొన్నిటిని కలిపి ఓ గుంపుగాచేసి, వాటి మధ్య ఓ సమానత్వాన్ని, అర్థాన్ని, వుందని వూహించుకుంటేనేగాని ఈ తెలుసుకోగల శక్తిలేదు మనసుకి. అందుకనే ఇన్నిసయిన్సులూ, శాస్త్రాలూ, ధర్మాలూ. కాని అన్వేషించినకొద్దీ అన్నీ అబద్ధాలని తేలుతోంది. అబద్ధాలని తెలిసికూడా సత్యాలని నమ్మితేనేగాని బతుకు సాగదు. లేనివన్ని వున్నట్టు భ్రమకల్పిస్తూ తిరుగుతూ వుంటాయి మనచుట్టూ.

**Beauty that must die**
**An joy, whose hand is ever at his lips**
**Bidding adieu; and aching pleasure nigh,**
**Turning to poison while the bee - mouth sips.**

అందుకనే ఇదంతా ఏంలేదు. మాయఅనడం చివరి విజ్ఞానం అయింది. కాని దాంటోంచి ఏం సత్యంవొస్తుంది. ఏంPlan ఏ పర్యవసానం ఆలోచించుకోవలసిన అవసరముంటుంది? ఏంలేనిదాంటో, ఏదోవుందని వెతికే, సయిన్టిస్టుకీ తత్వఅన్వేషకుడికీ ఏం దొరకుతుంది? లేనిదాన్ని కూడా సృష్టించుకునే ఆర్టిస్టు వ్యర్థవిశ్వాసంగాక!

సత్యాన్ని అన్వేషించినకొద్దీ అసత్యం అనేది లేదని తెలుస్తుంది. అంటే, దేంటో సత్యం వుందనుకుంటున్నామో, ఏద సత్యమనుకున్నామో అదికాదని. ఎందుకంటే మన మనసులంత సిన్‌సియర్ ఐన ఇతరమైన మనసుల్లో మన సత్యానికి విరుద్ధమైన సత్యాలు ఉన్నాయి గనక. అంటే వాస్తవంలో ఒకవేపుకన్న మనం తెలుసుకోలేము. ఆవాస్తవం అసంపూర్ణం గనక, సంపూర్ణమైన సత్యంలో అది అబద్ధం. అబద్ధమంతా కూడా అసంపూర్ణమైన సత్యమే గనక. మరి దేనిని నమ్మిబతకడం? కనక సత్యాన్వేషణ వృథా అనుకుందామంటే, సత్యాన్ని అన్వేషించేగుణం మనిషి మనఘుని విడవదు. కనకీ మనసు అనేది పనిచేస్తున్నంతసేపు ఏనిజాన్ని అసంపూర్ణంగా తప్ప తెలుసుకోలేదనీ, ఇతరుల మనసులోని నిజాన్ని గుర్తించి విశాలత్వాన్ని సంపాయించడమే అవధిఅనీ, తెలుసుకోగలిగితే చాలునేమో!

కవిత్వమంతా అబద్ధం. ఆ అందమూ, ఆదుఃఖమూ కవి కంటికేగాని కనబడవు.

'ఈఅడవి దాగిపోనీ, ఇచటనే ఆగిపో అంటే. దాగిపో. కాని కాఫీవేళ కాగానే, గండు చీమలుకుట్టగానే, అడివిమూలనించి బైటపడాలి. అంతమాత్రంచేత ఆ అడవి దాగిపోవాలనే కవివాంఛ హాస్యాస్పదంగాని అసత్యంగాని కాదు.

మనకి సంపూర్ణమైన సత్యస్వరూపం తెలీదుగనుక, మనకి విరుద్ధమైన సత్యాలున్నాయిగనక, 'ఏది సత్యం, ఏది నిత్యం?' అని అడుగుతో కూచోనక్కరలేదు.

ఏనాటికి మనకి నిజమని నిశ్చయంగా తోస్తుందో ఆనాటికి అది నిజం.

చూస్తుండగా మనం ప్రేమించిన మనిషి చచ్చిపోతున్నాడు. మనిషిమాయ కావొచ్చు. కాని నేనిచ్చిన ప్రేమ మాయకాదు.

పోయినప్పుడా, ఏడుస్తాను; ఎందుకో? అంతే జీవితం గనక.

ప్రేమ మాయా? నా ఏడుపూ మాయే.

ఈ ప్రేమించడం, పోగొట్టుకోడం, ఏడవడం — నేను ఏర్పరచలేదు ఇది.

ఎట్లాపడ్డానో, పుట్టి ఈ ఇరుకులో పడ్డాను. పడితే పడ్డాను. ఈ ఇరుకు వొదిలిందాకా ఇట్లాగే వుంటాను, ప్రేమిస్తో ఏడుస్తో. వదిలిన రోజున, ఇంకావుంటే, నవ్వుతాను.

"నే నీ జీవితాన్ని ఇంత ప్రేమిస్తున్నానుగనక, మృత్యువునీ అంతగానే ప్రేమిస్తాను."

"నేనుపుట్టగానే నన్ను తల్లిరూపాన ఆదరించినవాడు, మృత్యువు తరవాతకూడా నాజాగ్రత్త తీసుకోకపోడు."

ఇట్లాంటి గొప్ప కవిత్వంతో, నిశ్చయంతో, ఆప్టిమిజంతో, కలలు రేకెత్తించి ఓదారుస్తాడు టాగూర్! ప్రతినిమిషం నశించే పురుగులం మనం; అంటామా? కాదు పురుగుకీ ఓ అందం ప్రాధాన్యమిస్తాడు; జీవితమే ఒక పొంగే సంతోషార్ణవం.

ఈభయాలూ, విచారాలూ, బాధలూ తాత్కాలికమని నమ్మిస్తాడు.

అదంతా వుత్త అబద్ధం వుత్తకవిత్వం, అంటారా శ్రీ శ్రీ. మన అనుమానాలూ, భయాలూ, శూన్యత్వం, మానవ జీవితపురోవృద్ధీ, మరోలోకం, కవిత్వపు కలలుగాక, వాస్తవ మంటారా?

వాస్తవమేదో తెలీనప్పుడు, తెలుసుకోడం అసంభవమైనప్పుడు, పోనీ ఆశతో కూడిన అందమైన కలలే కందాము.

శ్రీ శ్రీ free-lance మీబాధ్యతలేని రోజులై పోయినాయి. వొద్దంటున్నా మీకు చాలా ప్రధానమైన స్థానమిచ్చి చూస్తున్నారు తెలుగు వాంగ్మయంలో! మీరేమంటున్నారో, చాలాదీక్షతో, ఆశతో చూచేవాళ్ళల్లో నేనూ ఒకణ్ని. మీరు ఇంకా అల్లరిచేస్తే ఎట్లా? మీఅల్లరినికూడా, దీంటో అర్థమేమా అని వెతుకుతాంమరి!

కాని అన్నీ ఊహలు, వూహలు, ఏమీ కాని దాంటోంచి ఏదో తియ్యాలని జీడిపాకం యత్నాలు మెరిడిత్ అన్నట్టు—

**Ah, what a dusty answer gets the soul**
**When hot for certainities in this our life!**
**In tragic hints here see what evermore**
**Moves dark as Yonder midnight ocean's force.**

ఇంతే, జాలివేస్తుంది మానవుడి వెతుకులాట.

వనరు చేద్వగలేను, చచ్చి చావగలేను
కనలేని వెలుగుకొఱకై,
ఎన్నడును,
కనరాని దానికొరకై.

అని గొప్పగా బాధపడ్డారు మనశాస్త్రిగారు. కృష్ణశాస్త్రిగారి కవిత్వమంతా గొప్ప అన్వేషణ. అందుకనే అంత దిగులు, అంత నిరాశ.

వెలుగు ఇంత అందరానిది కావడంచేతనే, **All great art is tragic.**

కాని ఈ అశాంతి. ఈ వెలుగుకొరకు ఏడుపు—దీనికంతా ఒక గొప్ప అర్థం సంతోషం వుంటుంది. చివరికి ఈ తెర తొలగడ మనేదివుంటే, దానివెనక తెలుసుకోవలసిందీ, అనుభవించ వలసిందీ ఒకటివుంటే! అదేమిటో చెప్పమని గట్టిగా అడిగితే—ఆ వెనక ఏమీ లేదని తెలుసుకోడం, అన్నారు. పోనీ ఏదోవొకటి.

కలడుకలండనెడు వాడుకలడో లేడో.

కలడనిగాని, లేడనిగాని, అసలు తెలుసుకోడ మనేది ఎప్పటికైనా వుంటుందా అని. చాలా నిశ్చయమైన దేమిటంటే ఈకలడో, లేడో అనేది తెలుసుకోవాలని మథనపడేవాడు, లేకండా పోతాడనేది.

ఎంతకార్యశూరులుకానీ, ఎంతలో కొద్దిరుణకార్యనిమగ్నులుకానీ, పూర్వంనించీ ప్రతిజ్ఞాని మాట్లాడుతున్నవీ ముందుకాలంలోకి సృష్టిరహస్యాన్ని వెతుకుతూ ఈనాటి జ్ఞానులు తెలుసుకొంటున్నవీ ఐన గొప్పసత్యాల్ని మరిచి చరించే వాళ్ళజ్ఞానం చాలా సంకుచితం. లోకజ్ఞానం నీ మనసుమీద ఆధారపడివుంది, నువ్వెంత కష్టపడి సేవ చేసి

నా, ఈ ప్రపంచం ఓనాడు నీకువుండదు. నువ్వీప్రపంచానికి వుండవు.

ఈలోకాన్ని మరిచి, దాని రహస్యంలో నిమగ్నులు కావడం ఎంత మూర్ఖమో, ఆ రహస్య మేమిటనే ప్రశ్నని మరిచి, ఈలోకంలో నిమగ్నులు కావడం అంతకన్న మూర్ఖమేమో ! ఆ రహస్యాన్వేషణ ఫలిస్తుందనీ నిశ్చయం లేదు; నీ లోకోద్ధరణ ఫలిస్తుందని నశ్చయ మేముంది ?

ఈ తీరపు ఘోష వెనక విజృంభించే మహార్ణవరవాన్ని ఆలకించడం ఎన్నడూ మానలేదు శ్రీ శ్రీ చెవి. ఆ కారణం వల్లనే ఈ నవీన అభ్యుదయ కవిత్వాధ్వర్యులకు అనుమానా స్పదుడైనాడు ఆయన. ఎన్నటికీ గొప్పరాజకీయనాయకుడు కాలేదు జయప్రకాశ్.

తెల్లారకట్టనించి మొదలుపెడతాయి యీ హోటళ్ళు ఇడ్లీకాఫీకి రమ్మని మనుష్యుల్ని పిలవడం.

"ఆజా, ఆజా" అంటుంది జకంఠం.

"ఏదినీతి? ఏదీనేతి" అంటోంటే, నేతిపెసరట్టు అంటాడు హోటలు మనిషి.

"ఓమహాత్మా, ఓమహర్షి" అని పిలిస్తే లోపల్నించి కాఫీకప్పులతో వొస్తాడు సైటికి సర్వర్.

---

# గుంటూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్టు మున్సిఫ్ కోర్టులో

## O. S. No. 15/1949

వాది:—చెన్నూరి జగన్నాథరావు.

వెంబడి

ప్రతివాదులు:—చెన్నూరి క్రిష్ణవేణమ్మ వగయిరాలు.

వాదికి యిందుమూలముగా తెలియజేయునది యేమనగా యీనెంబరులో ప్రతివాదులమీద ది· 4_8—49 తేదీన ప్యాసుకాబడిన (Exparte decree) ని యక్సాపార్టీడిక్రీని రద్దునిమిత్తముఆయాప్రతివాదులవల్ల I. A. $\frac{1599}{49}$; I. A, $\frac{1600}{49}$; I. A. $\frac{1767}{49}$; నెంబర్లుగల పిటీషనులు దాఖలు చేయుగా వాది ఆక్షేపణ నిమిత్తము ది. 26—10—1949 వ తేదీకి వాయిదాలు వేయబడినవి. గనుక ఆక్షేపణలున్నచో వాయిదా రోజున ఉదయం ప౯.లు 10 గంటలకు కోర్టుకు హాజరుఅయి తెలియపర్చుకొనవలెను. లేనియెడల వాది పరోక్షమందు విచారించి తీర్మానించ బడునని తెలుసుకొనేది.

1. గోవిందరాజుల వెంకటదత్తాత్రేయశర్మ
2. పెమ్మరాజు సత్యనారాయణ
3. మన్నవ నరసింహ్వారావు

ప్రతివాదుల తరఫున అడ్వకేట్లు